క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా భీమేష్



చిప్పగిరి: చిప్పగిరి ఇన్‌చార్జ్ తహసీల్దార్ గా బి.బీమేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పద్మజ బదిలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లగా ఆస్పరి మండలం డిప్యూటీ తహసీల్దార్ బీమేష్ చిప్పగిరి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వచ్చారు.

తహసీల్దార్ షర్మిలకు సన్మానం



తహసీల్దార్ షర్మిలను సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తుగ్గలి : ఎన్నికల విధుల్లో భాగంగా వచ్చిన తహసీల్దార్ షర్మిల తిరిగి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెను రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్ఏలు, చౌకదుకాణ డీలర్లు, సిబ్బంది పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. డీటీ నాగరాజు, సీనియర్ అసిస్టెంట్ రాముడు, ఆర్ఐ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు



మందులు పిచికారి చేస్తున్న దృశ్యం

మద్దికెర: మురుగనీరు ప్రవహించే ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టినట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, సర్పంచ్ సుహాసిని తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన మద్దికెరలో డ్రైనేజీలు, మురుగునీరు పారే ప్రాంతాలలో మందులు పిచికారీ చేయించారు. ప్రజలు వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను బయట వేయకుండా చెత్తబండ్లు వచ్చినపుడు వేయాలని సూచించారు.

అమ్మవారికి శాకాంబరి అలంకారం



వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణంలోని అమ్మవారి శాలలో కొలువైన కన్యకా పరమేశ్వరీదేవి మంగళవారం శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): ఎన్నికల సందర్భంగా సత్యసాయి జిల్లా నుంచి వచ్చిన వెల్దుర్తి తహసీల్దార్ అనంతాచారి మంగళవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆయనకు పూలమాల, శాలువాలతో సత్కరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికల నాటి నుంచి నేటి వరకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ధనుంజయ రెడ్డి, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాత రికార్డులను భద్రపరుస్తున్న అధికారులు



కార్యాలయంలోని దస్త్రాలను భద్రపరుస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆలూరు: రెవెన్యూ పురాతన దస్త్రాలను భద్రపరచాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆలూరు డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో పాత రికార్డులను మూడు రోజుల నుంచి భద్రపరుస్తున్నారు. మండలంలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, సర్వేయర్లు గ్రామాల వారీగా రికార్డులన తయారు చేస్తున్నారు. మదనపల్లి సంఘటనలో భాగంగానే ప్రభుత్వం రికార్డులను గ్రామాల వారీగా భద్రపరచాలని పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి ఆదేశాల మేరకు పూర్తిచేస్తున్నామని డిప్యూటీ తహసీల్దార్ రజనీకాంత్ రెడ్డి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- టీడీపీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- ఎమ్మెల్యే ఎమ్మెల్యే విరూపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

హాలహర్వి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే విరూపాక్షి సూచించారు. టీడీపీ నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ శాఖల అధికారులు తమపరిధిలోని అంశాలను సభ దృష్టికి తీసుకెళ్లారు. ఏఓ శివశంకర్ మాట్లాడుతూ రైతులు రసాయనిక మందులు వాడరాదని, సేంద్రియ మందులనే వాడాలన్నారు. చింతకుంట, గూళ్యం గ్రామానికి పశువైద్యాధికారులను నియమించాలని పశువైద్యాధికారి అశోక్‌కుమార్ కోరగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మల్లికార్జునపల్లిలో స్కూల్ బిల్డింగ్‌పై విద్యుత్ వైర్లు వెళ్లడంతో ఇబ్బందిగా మారిందని సర్పంచ్ లక్ష్మి విన్నవించారు. ఎంఈఓ ఈరన్న మాట్లాడుతూ టీచర్ల కొరత ఉందని, పరిష్కరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మణ్ మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో మంచినీటి సమస్య ఉందని, త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం తగదని, వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రజాప్రతినిధులు తెలుపగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హౌసింగ్ ఏఈ గోపీనాథ్‌వర్మ చెప్పారు. బిల్లులు పెండింగ్ పెట్టొద్దని, ఎప్పటికప్పుడు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హౌసింగ్ ఏఈకి సూచించారు.

దమ్ముంటే రాజీనామా చేసి... మళ్లీ జెడ్పీటీసీగా గెలువు

- లింగప్పకు ఎమ్మెల్యే విరూపాక్షి సవాల్

మండల సర్వసభ్య సమావేశంలో హౌసింగ్ ఏఈ గోపీనాథ్‌వర్మ మాట్లాడుతుండగా జెడ్పీటీసీ లింగప్ప అడ్డుతగిలారు. మా టీడీపీ ప్రభుత్వం వచ్చిందని, అన్ని సమస్యలు పరిష్కరిస్తుందంటూ రాద్ధాంతం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ అభివృద్ధి చేయలేదని జెడ్పీటీసీ అనడంలో ఒక్కసారిగా ఎమ్మెల్యే విరుపాక్షితోపాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తిరుగబడ్డారు. ఏమి మాట్లాడుతున్నావో అర్థం అవుతుందా జెడ్పీటీసీ లింగప్పా అంటూ ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున జెడ్పీటీసీగా గెలిచి స్వార్థప్రయోజనాల కోసం టీడీపీ పంచనచేరి విమర్శలు చేయడం ఏంటని ఎమ్మెల్యే నిలదీశారు. నీకు దమ్ముంటే జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేసి టీడీపీ సహకారంతో మళ్లీ గెలువాలని ఎమ్మెల్యేతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సవాల్ విసిరారు. దీంతో ఒక్కసారిగా సభలో గందరగోళం నెలకొంది. వైఎస్సార్‌సీపీ తరఫున గెలిచి మా పార్టీనే విమర్శించిన నీవు... జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేసి అప్పుడు మాట్లాడాలని... అంతవరకు నీకు మాట్లాడే హక్కు కూడా లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. ఏమి సమాధానం చెప్పాలో తెలియక జెడ్పీటీసీ మిన్నకుండిపోయారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నగేష్, ఈఓపీఆర్‌డీ మల్లికార్జున, ఏపీఓ హేమసుందర్, ఏఓ శివశంకర్, ఏపీఎం శివయ్య, విద్యుత్‌శాఖ ఏఈ జమ్మన్న, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చందన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మన్న, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మన్సూర్‌వలి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామంలో రూ. పది లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి భూమి పూజ చేశారు. గ్రామంలో అత్యవసరం ఉన్న కాలనీల్లో సీపీ రోడ్లు నిర్మించుకోవాలని సర్పంచి గారింటి మల్లమ్మకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రోజుకో స్వేత పత్రం రిలీజ్ చేస్తూ హామీలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. కాలయాపన చేయకుండా సూపర్ సిక్స్ పథకాలు సత్వరమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ మారయ్య,నాగేంద్ర శేషిరెడ్డి,బీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



మనోహరప్పతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: మండల కేంద్రం హాలహర్విలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు హోటల్ మనోరప్ప ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మంగళవారం మనోహరప్ప ఇంటికెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. మనోహరప్ప సేవలను గుర్తు చేసిన ఎమ్మెల్యే పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇనిచ్చారు.

అథ్లెటిక్స్ పోటీల్లో గజ్జహళ్లి విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినికి ప్రశంసా పత్రం ఇస్తున్న దృశ్యం

హొళగుంద: ఆలూరులో మంగళవారం రూరల్ బాలికల అథ్లెటిక్స్ మీట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో గజ్జహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో శకుంతల, 100 మీటర్స్ రన్నింగ్ రేస్‌లో మౌనిక సత్తాను చాటారని వ్యాయమ ఉపాధ్యాయు రాలు రజనీ తెలిపారు. వీరు అనంతపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

వర్షం కోసం పూజలు



కుంభాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో మంగళవారం వర్షం కోసం సుంకులమ్మవ్వ, పెద్దమ్మవ్వకు ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రస్వామి ఆలయం నుంచి అమ్మవార్ల ఆలయం వరకు కుంభాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు. విత్తనం వేసి 40 రోజులు పూర్తయినా వర్షం కరువకపోవడంతో పత్తి, వేరుశనగ వాడిపోతున్నాయని, దీంతో అమ్మవారి నైవేద్యం సమర్పించామని గ్రామస్తులు తెలిపారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడండి



ఆలూరులో తాగునీరు సరఫరాను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు

ఆలూరు రూరల్: ఇంటింటికీ తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆయన ఆలూరులో ఇంటింటికీ తాగునీరు సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారంలో రెండు సార్లు తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు తాగునీటిని వృథా చేయరాదన్నారు. సామర్థ్యానికి మించిన విద్యుత మోటార్లు వాడరాదన్నారు. ఇకపై పట్టణంలో నాలుగు రోజులకో సారి తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పైపులైన్ల మరమ్మతులు, లీకేజీలు అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు. నెలలో రెండు సార్లు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు శుభ్రం చేయించాలన్నారు. ఎల్ఎల్‌సీ కాలువ నుంచి హాలహర్వి మండలంలోని బాపురం రిజర్వాయర్‌కు 16 గంటలు నీటి పంపింగ్ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య, ఈఓ ప్రకాష్ నాయుడు, జేఈ మోహన్ పాల్గొన్నారు.

కంది సాగుకు ఆగస్టు మొదటి వారం వరకు అవకాశం

మద్దికెర : ఖరీఫ్ సీజన్‌లో కంది పంటను సాగు చేసే రైతులు ఆగస్టు మొదటి వారం వరకు విత్తనం వేసేందుకు వీలుందని ఏఓ రవి మంగళవారం తెలిపారు. మండలంలో తేలికపాటి వర్షాలు పడుతున్నాయని, అందువల్ల విత్తనం వేయడంలో ఆలస్యమవుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసి విత్తనాలు వేయాలన్నారు. అలాగే మందులు పిచికారీ కోసం ఇష్టానుసారంగా క్రిమిసంహారక మందులు వినియోగించకుండా వ్యవసాయాధికారులు సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు.

రసం పీల్చు పురుగులను నివారించుకోవాలి

దేవనకొండ: రైతులు పత్తి పంటకు సోకే రసం పీల్చు పురుగులను నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో రైతులకు రసం పీల్చు పురుగుల నివారణపై అవగాహన కల్పించారు. మండలంలో దాదాపు 60 వేల ఎకరాల్లో పత్తి, వేరుశనగ, కంది, ఉల్లి తదితర పంటలను రైతులు సాగుచేశారన్నారు. మండలంలో తక్కువ వర్షపాతం ఉండడంతో రసం పీల్చు పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. పత్తిలో రసం పీల్చు పురుగుల నివారణకు పసుపు రంగు, నీలంరంగు, జిగురు అట్టలను ఎకరాకు 30 వరకు పెట్టుకోవాలన్నారు. మొదటగా వేపనూనె (1000పీపీఎం) 5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.

తొగలుగల్లుకు రోడ్డు వేయించండి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు నుంచి తొగలుగల్లు గ్రామానికి బీటీ రోడ్డు వేయించాలని మంగళవారం మండలం పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనిమేష్‌కు సీపీఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా సీపీఐ నాయకులు క్రిష్ణమూర్తి, బ్రహ్మయ్య మాట్లాడుతూ యాటకల్లు నుంచి తొగలుగల్లుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారిందని, రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. సమస్యను అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. పంట దిగుబడలను మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు హనుమంతు, మహానంది, పాండు, రవి, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుజాత

ఆలూరు రూరల్: ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాలుర-2 పాఠశాల గ్రౌండ్‌లో ఆలూరు,ఆస్పరి,చిప్పగిరి,హొళగుంద,హాలహర్వి మండలాల హైస్కూల్ విద్యార్థినులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆలూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం సుజాత ప్రారంభించారు. 100 మీటర్స్, 200 మీటర్స్, 60 మీటర్స్ పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 150 మంది విద్యార్థినులు పాల్గొనగా 21 మంది విజేతలుగా నిలిచారు. విజేత విద్యార్థినులు ఆగస్టు 26,27,28 తేదీల్లో స్పోర్ట్స్ డే సందర్భంగా ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఆలూరు ఆర్డీటీ టీం లీడర్ హనుమంతప్ప, బాలురు-2 పాఠశాల పీడీ కవిరాజు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆగస్టు 1వ తేదీనే పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల ఎంపీడీఓలు శివశంకరప్ప, రాబర్ట్ విల్సన్ మంగళవారం తెలిపారు. తొలిరోజే వంద శాతం పూర్తి చేసేలా పింఛన్ పంపిణీ చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. ఉదయం 6గంటల నుంచే పంపిణీ ప్రారంభిస్తామని, లబ్ధిదారులు తమ ఇళ్ల వద్ద ఉండాలంటూ కోరుతున్నారు. వెల్దుర్తి పరిధిలోని 7,966 మంది లబ్ధిదారులకు రూ.3,36,36,000లు, కృష్ణగిరి పరిధిలోని 4,831 మంది లబ్ధిదారులకు రూ.2,07,24,500లు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధులకు అడ్డుకట్ట



నీటిని పారబోస్తున్న వైద్య సిబ్బంది

తుగ్గలి(పత్తికొండ): దోమల నిర్మూలనకు పరిసరాల శుభ్రత పాటించాలని, అప్పుడే వ్యాధులకు అడ్డుకట్ట పడుతుందని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. పత్తికొండ పట్టణంలోని రాజీవ్ నగర్‌లో ఐదు రోజుల క్రితం డెంగీ కేసు నమోదు కావడంతో అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. మంగళవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి కాలనీలో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద నిల్వ ఉన్న నీటిని పార బోయించి యాంటీ లార్వా స్ప్రే మందు చేయించారు. నీటి కుండీలపై మూతలు పెట్టుకోవాలని, ఇళ్లలోని ఫ్రిజ్‌ల వెనుక ఉన్న నీటిని కూడా శుభ్రం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సుజాత, మలేరియా సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, ఆరోగ్య పర్యవేక్షకులు రవికుమార్, ప్రకాష్, వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ కరుణ, ఆరోగ్య కార్యకర్త కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కల్పించాలి

మద్దికెర : డెంగీ, మలేరియా వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మద్దికెరలోని ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది గ్రామాలలో ఇంటింటికి తిరిగి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అప్రమత్తం చేయాలన్నారు. దోమల ఉత్పత్తి ప్రాంతాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాగిణి, శ్రీలక్ష్మి, సీహెచ్ఓ నిరంజన్, ఎస్ఈఓ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల పరిధిలోని కాశాపురం గ్రామ పరిధిలో మంగళవారం దాయాదుల మధ్య జరిగిన పొలం విషయంలో జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన పెద్ద ఈశ్వరయ్య గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. తమ దాయాదులు వెంకటస్వామి, తిరుపాలు తదితరులు దాడిచేసి గాయపరిచినట్లు బాధితుడు తెలిపాడు.

నదులను అనుసంధానించండి

వెల్దుర్తి(కృష్ణగిరి): వరదలు, కరువును నివారించేలా దేశంలోని అన్ని నదుల అనుసంధానం చేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన తమ సంస్థ ప్రతినిధులు, ప్రముఖులతో విద్యానికేతన్ పాఠశాలలో సమావేశమై మాట్లాడారు. రాయలసీమలో వానల్లేక రైతుల ఆత్మహత్యలు, కేరళలో వరదలో చావులు చూస్తున్నామన్నారు. ఈ పరిస్థితులు రాకుండా ప్రభుత్వాలు పక్కా ప్రణాళికతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రైతు నాయకుడు పరమేశ్, ప్రముఖులు, మేధావులు హరినాథ్, పామయ్య, ఖలీల్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్ట్



అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్న సెబ్ పోలీసులు

ఆలూరు రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆలూరు ఇన్‌చార్జ్ సెబ్ సీఐ మల్లిక తెలిపారు. మంగళవారం స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉదయం జిల్లా స్పెషల్ టీం, ఆలూరు సెబ్ పోలీసులతో కలిసి హాలహర్వి మండలం బిలేహాలు గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జయచంద్ర, బోయ లక్ష్మి అనే ఇద్దరిని అదుపులో తీసుకున్నామన్నారు. వారి నుంచి 77 కర్ణాటక 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ వీరస్వామి,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పోలీసులు వియజయుడు, రామలింగమ్మ పాల్గొన్నారు.

సర్పంచ్ భర్తకు పరామర్శ



కురువ హనుమంతును పరామర్శిస్తున్న ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి గ్రామ పంచాయతీ సర్పంచ్ కురువ మాదేవమ్మ భర్త కురువ హనుమంతు మూడు రోజులు క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి మంగళవారం సంగాల గ్రామంలో హనుమంతును పరామర్శించారు. ప్రమాద వివరాలు బాధితుడి కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు గిడ్డయ్యను అడిగి తెలుసుకున్నారు. పార్టీ ఎళ్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వైస్ ఎంపీపీ-2 కత్తి రాజేష్, రామకృష్ణ, నాగేశ్వరరావు, హరికృష్ణ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

పథకాలు సక్రమంగా అందేలా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ అలివేలమ్మ

మద్దికెర : ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై వుందని జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీపీ అనిత, ఎంపీడీఓ అలివేలమ్మ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వినిపించారు. మండలంలో కౌలు రైతుల ముసుగులో బినామీ కౌలు రైతు కార్డు కోసం దరఖాస్తు చేసుకొని ప్రభుత్వ సొమ్మును కాజేయాలని చూస్తున్నారని వైస్ ఎంపీపీ మహేష్‌రెడ్డి ఆరోపించారు. బీమా సొమ్ము రైతులు చెల్లించాలా లేక గతంలో మాదిరిగా ప్రభుత్వమే చెల్లిస్తుందా అని పెరవలి సర్పంచులు మల్లికార్జున, విజయుడు ఏఓ రవిని ప్రశ్నించారు. బినామీ రైతులు దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయరని, బీమా గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని ఏఓ సమాధానమిచ్చారు. సమావేశంలో పరిపాలన అధికారి స్వర్ణలత, ఇన్‌చార్జ్ తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, ఎంఈఓ రంగస్వామి, ఏఈ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



గోవర్ధనగిరి పరిధిలోని వేరుశనగ పంట పరిశీలనలో ఏడీఏ, ఏఓ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంతో పాటు సూదేపల్లె, గోవర్ధనగిరి, బింగిదొడ్డి గ్రామాల పరిధిలో సాగు చేసిన వేరుశనగ, కంది, పత్తి, ఆముదము పంటలను మంగళవారం పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, ఏఓ అక్బర్‌బాషాతో కలిసి పరిశీలించారు. పలుచోట్ల వేరుశనగకు లద్దెపురుగు ఆశించినట్లు గుర్తించారు. నివారణకు క్లోరాంత్రనిలిప్రోల్ లేదా ఫ్లూబెండమైడ్ మందును వేపనూనెతో కలిసి సాయంత్రం సమయంలో పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పత్తి పంటలో ఆశించిన పచ్చదోమ నివారణకు ఆసిటామిప్రిడ్ లేదా ఫ్లోనికామిడ్ లేదా అసిఫేట్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేయాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షణ బుట్టలు అమర్చాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్, కాపర్‌వైర్ చోరీ

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ పరిధిలోని కోదండాపురం దస్తగిరిస్వామి రోడ్డులో ఉన్న రైతు హబీబా పొలంలోని 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని ఆయిల్, వైండింగ్ కాపర్ వైర్‌ను చోరీ చేసినట్లు విద్యుత్ ఏఈ రాఘవేంద్రప్రసాద్ మంగళవారం తెలిపారు. రైతులందించిన సమాచారం మేరకు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి రూ.70వేల నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు పిర్యాదు చేసినట్లు ఏఈ తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ మండల శాఖ ప్రతినిధులు మంగళవారం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ సునీతకు వినతి పత్రం సమర్పించారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేశ్, ప్రసాద్ మాట్లాడుతూ జీఓ 117ను రద్దు చేయాలని, ప్రైమరీ స్కూళ్లు 5వ తరగతి వరకు కొనసాగించాలని, ఒకే సిలబస్ ఒకే పరీక్ష విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు శంకరయ్య, ప్రతినిధులు నాగేంద్రయ్య, కిష్టన్న తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని బైకిస్టుకు గాయాలు

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణ సమీపంలోని హైవే 44పై మంగళవారం కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో వెల్దుర్తి కొండపేటలో నివాసముంటున్న కొసనాపల్లె కురువ రామాంజనేయులు తీవ్రంగా గాయపడ్డాడు. డోన్ రైల్వే గేట్ల వైపు నుంచి రామాంజనేయులు బైక్‌పై వెళ్తూ హైవేపై యూటర్న్ తీసుకోగా అదే సమయంలో డోన్ వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొంది. బైక్‌పై నుంచి కిందపడ్డ రామాంజనయులకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఈనెల 27న జరిగిన సామాజిక తనిఖీల్లో అక్రమాలు భారీగా బయటపడ్డాయి. ఫీల్డ్ అసిస్టెంట్ రికార్డులు సరిగా నిర్వహించకపోవడంతో, పనికి పోకుండా కొద్ది మందికి ఉపాధి వేతనాలు చెల్లించడం , హార్టికల్చర్ కింద మొక్కలు వచ్చినా రైతులకు తెలియజేయలేదని అధికారులు గుర్తించారు. దీంతో డ్వామాపీడీ అమరనాథ్‌రెడ్డి సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

దేవనకొండలో స్వల్ప ఉద్రిక్తత

దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండలో ఇరు పార్టీల నాయకులు ఘర్షణ పడడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. మండలంలోని వెలమకూరు గ్రామానికి చెందిన టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులు దేవనకొండలోని ఓ టీస్టాల్ వద్ద గొడవకు దిగారు. ఇరువర్గాల కార్యకర్తలు గుంపులుగా అక్కడికి చేరుకున్నారు. సీఐ శ్రీనివాసులుతోపాటు పోలీసులు గుంపును చెదరగొట్టారు. వెలమకూరులో పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తామని సీఐ విలేకరులకు చెప్పారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కృష్ణగిరి: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే వ్యాధులు దరి చేరవని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ అన్నారు. మండల పరిధిలోని ఆగవేలి, పోతుగల్లు గ్రామాల్లో మంగళవారం ఈఓఆర్డీ మురళీమోహన్‌తో కలిసి పర్యటించారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, చిన్న మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

హొళగుంద: పర్యావరణాన్ని కాపడడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం, హొళగుంద పీహెచ్‌సీ డాక్టర్ న్యూటన్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం వారు హొళగుంద సిద్ధార్థ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కరస్పాండెంట్ చిదానంద, స్టాఫ్ పవన్ తదితరులు పాల్గొన్నారు.